

సోలార్ కుళాయి ప్రారంభం

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: అరకులోయ మండలం లోతేరు పంచాయతీ తోటబంద గ్రామంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిధులతో జల్ జీవన్ మిషన్ పథకం కింద నిర్మించిన సోలార్ కుళాయిను ఆదివారం స్థానిక సర్పంచ్ గుజ్జాలు కళావతి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామస్తులు నూతనంగా నిర్మించిన కుళాయిను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెసా కమిటీ ఉపాధ్యక్షుడు కిల్లో బీమ్మ, వార్డు సభ్యులు జి వెంకటరావు, వైసిపి అధికార ప్రతినిధి జి.శ్రీరాములు, చెట్టి గెన్ను గ్రామస్తులు కిల్లో త్రినాథ్, భీమిడి బైకోన్ పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న సర్పంచ్

కాఫీ రైతులకు.. రూ.50 వేల నష్టపరిహారం చెల్లించాలి

ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర



తెగులు సోకిన కాఫీ గింజలను పరిశీలిస్తున్న సురేంద్ర

ప్రజాశక్తి- అరకులోయ: కాఫీ బెర్రి బోరర్ వైరస్ సోకి నష్టపోయిన కాఫీ రైతులకు ప్రభుత్వం ఎకరాకు రూ.50 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. చినలబుడు పంచాయతీ తురైగూడ,పకనకుడి గ్రామాలలో బెర్రి బోరర్ బాధిత కాఫీ రైతుల తోటలను ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర ఆధ్వర్యంలో కాఫీ రైతు సంఘం నేతలు తోటలను పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బెర్రి బోరర్ పురుగుతో నష్టపోతున్న కాఫీ తోటలను ప్రభుత్వం తక్షణమే కాపాడాలని డిమాండ్ చేశారు. కాఫీ తోటలో వ్యాప్తి చెందకుండా నివారణ చర్యలు యుద్ధ ప్రాతిపదిన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.ఈ పురుగుతో నష్టపోయిన ఎకర కాఫీ తోటలకు రూ.50 వేలు, కిలో కాఫీ పళ్ళను రూ.200 చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. భారీగా నష్ట పోతున్న కాఫీ తోటలను ప్రభుత్వం మాత్రం కంటి తుడుపుగా కేవలం ఎకరాకు కేవలం 20 వేలు, కిలో కాఫీ పళ్ళను రూ.50 నష్టపరిహారం చెల్లిస్తామని అనడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.ప్రభుత్వం నష్టపోతున్న బాధిత రైతులకు ఉచితంగా పురుగు మందులు, నివారణ చర్యలకు సహాయం చెయ్యాలని, కీటకాలు నాశనం చేసేందుకు కూలీలు ప్రభుత్వం ఏర్పాటు చెయ్యాలని డిమాండ్ చేశారు. ఆదివాసి ఆర్గానిక్ కాఫీ పంట రక్షణకు కాఫీ బోర్డు ద్వారా మాత్రమే విత్తనాలు పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అరకువేలి మండలం చినలబుడు పంచాయతీలోని తురైగూడ, పకనకుడి, మాలిసింగారం, మాలివల్స గ్రామాల్లో సుమారు 100 ఎకరాల కాఫీ తోటల్లో బెర్రి బోరర్ (పుమ్మి) సోకి సుమారు 5 వేల కేజీల కాఫీ పళ్ళు నష్టపోయారని ఆయన అన్నారు. బెర్రి బోరర్ వ్యాప్తి చెందిన సుమారు 100 ఎకరాల కాఫీ తోటలను రెడ్ జోన్ గా ప్రభుత్వం గుర్తించిందని, ఇంత తీవ్రంగా వ్యాప్తి చెంది కాఫీ పంటలు నాశనం చేస్తుందని, దీన్ని వ్యాప్తి చెందకుండా యుద్ధ ప్రతిపదికన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాఫీ తోటల్లో అతివేగంగా వ్యాప్తి చెందుతూ కాఫీ పళ్ళను నాశనం చేస్తుందని, తక్షణమే ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చేతికి వచ్చిన కాఫీ పంటలు తీవ్ర నష్టం జరుగు తున్నందున ప్రభుత్వం ప్రకృతి విపత్తుగా భావించి ఏజెన్సీలోని 2.లక్షల 50 వేల కాఫీ తోటలలో బెర్రి బోరర్ సోక కుండా చర్యలు తీసుకుని కాఫీ తోటలు రక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏజెన్సీలో ప్రవేట్ సంస్థలకు కాఫీ విత్తనాల అమ్మకాలను నిషేధించాలని డిమాండ్ చేశారు. లేకపోతే భవిష్యత్ లో కాఫీ రైతులు ఉత్పత్తి చేసుకునే దుస్థితి ఏర్పడు తుందన్నారు. కాఫీ బోర్డు ద్వారా మాత్రమే విత్తనాలు రైతులకు అందించి, తోటలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాఫీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.చిన్నబాబు, ఆదివాసీ గిరిజన సంఘం అరకువేలి మండల కార్యదర్శి జి.బుజ్జిబాబు, గిరిజన సంఘం జిల్లా నేత కె.రామారావు, చినలబుడు పంచాయతీ నాయకుడు కె.ముకుందు తదితరులు పాల్గొన్నారు.

ఏకలవ్య పాఠశాలలో తనిఖీలు



భవనం పనులపై అడుగుతున్న దొన్నుదొర

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలోని జోల కుట్టు పంచాయతీ లబ్బూరు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను ఆదివారం ఏపీఎస్ఆర్ టి సి విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్ను దొర తనిఖీ చేశారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో నిర్మాణాలు చేపట్టిన భవనాల్లో పూర్తి కాకపోవడం, పాఠశాలలో కనీస సౌకర్యాలు లేవని వచ్చిన పత్రికా కథనాలకు స్పందించిన దొన్ను దొర ఆదివారం లబ్బూరు ఏకలవ్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ప్రిన్సిపాల్ సుమన్ తో మాట్లాడి నెలకొన్న సమస్యలు పై అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల భవనాలు నిర్మాణాలు దశలో ఉన్నాయని, హడావుడిగా పాఠశాల తరలింపు కారణంగా విద్యార్థులు అనేక అవస్థలను ఎదుర్కొంటున్నారన్నారు. మండల కేంద్రంలో గత ఏడు సంవత్సరాల క్రితం ఏకలవ్య ఇంగ్లీష్ మీడియం పాఠశాల ను టిడిపి ప్రభుత్వం హయంలో మంజూరై వాటిని నడపటానికి ప్రభుత్వ భవనాలు మండల కేంద్రంలో లేక పెద బయలు వైటిసి భవనంలో పాఠశాల నడుపుతూ కొనసాగిస్తూ గత ప్రభుత్వం కాలం గడిపిందన్నారు. గ్రౌండ్ ఫ్లోర్ మాత్రమే నిర్మాణాలు పూర్తి అయ్యాయన్నారు. విద్యార్థులకు మెనూ సక్రమంగా అమలు చేయాలన్నారు. మెనూ అమలు విషయం పై ఆయన ప్రశ్నించగా ఉపాధ్యాయుల దినోత్సవం నాడు బిరియాని చికెన్ పెట్టినందుకు ఈరోజు పెట్టలేదని విద్యార్థులు తెలిపారు. తాగునీటి సమస్యతోపాటు, రన్నింగ్ వాటర్, మరుగుదొడ్లు, వసతి గహాలు, ప్రహరి గోడ నిర్మాణాలు వేగవంతం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షురాలు సన్యాసమ్మ టిడిపి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కల్తీ సరుకుల అమ్మకాలపై ప్రత్యేక దృష్టి

- వారపు సంతలు, రిటైల్ షాపుల్లో తనిఖీలు
- ఫుడ్ సేఫ్టీ కోసం 2 వేల మందికి శిక్షణ
- ప్రజాశక్తితో జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ రావు వెల్లడి





ప్రజాశక్తి పాడేరు: జిల్లాలోని ఆహార పానీయ, ఉత్పత్తులు విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించి నిరంతరం నిఘాతో తనిఖీలు నిర్వహిస్తున్నామని జిల్లా ఫుడ్ ఇన్స్పెక్టర్ బి వేణుగోపాలరావు తెలిపారు. జిల్లాలోని 22 మండలాల పరిధిలో చేపడుతున్న ఆహార భద్రతా కార్యక్రమాలపై ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపిన వివరాలు ఆయన మాటల్లోనే...

ఆహార భద్రతా ప్రమాణాలపై చర్యలేమిటి?

జిల్లాలోని రంపచోడవరం, పాడేరు డివిజన్ల పరిధిలోని 22 మండలాల్లో హెూటల్స్ ,రెస్టారెంట్లు రిటైల్ షాపులు, వారపు సంతల్లో నిత్యం తనిఖీలు నిర్వహించి నాణ్యమైన ఆహార పానీయ ఉత్పత్తుల సరఫరాకు చర్యలు తీసుకుంటున్నాం.

ఆహార కల్తీలపై తీసుకుంటున్న చర్యలు

ఆహార కల్తీలకు పాల్పడే వారిపై తీవ్రతను బట్టి ఐదు లక్షల వరకు జరిమానా, ఏడేళ్ల వరకు జైలు శిక్ష వంటి కఠిన చర్యలు అమలవుతాయి. జిల్లాలో కల్తీ సరుకుల విక్రయాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి కల్తీ ఆయిల్స్ అమ్మకాల పై కట్టడి చేశాం. గతంలో అన్ లేబుల్ ఆయిల్స్ విక్రయాలు జరిగేవి. అలాగే పప్పు దినుసుల్లో చౌక రకం పప్పులు కలపడం వంటి కల్తీలు గుర్తించి అరికట్టాం. గడువు దాటిన వస్తువుల అమ్మకాలను నిరోధిస్తున్నాం.

జిల్లాలో సేకరించిన శాంపిల్స్

జిల్లాలో ఈ ఏడాది 250 శాంపిల్స్ ఆహార ఉత్పత్తుల నమూనాలు సేకరించి నాణ్యత లోపాలను గుర్తించి 40 కేసులు నమోదు చేశాం. వారిపై కోర్టు జరిమానా విధించే చర్యలు తీసుకున్నాం.

రెస్టారెంట్లలో తనిఖీలు జరుగుతున్నాయా?

జిల్లా పరిధిలో లైసెన్స్ కలిగిన హెూటల్స్, రెస్టారెంట్లు కలిసి మొత్తం 134 ఉన్నాయి. హెూటల్స్ లో ఆహార భద్రతా దృష్ట్యా ఫుడ్ కలర్స్ టేస్టింగ్ సాల్ట్ వినియోగాన్ని నిర్మూలించాం. తాత్కాలికంగా నిర్వహించే హెూటల్స్ పై కూడా దాడులు నిర్వహించి లైసెన్సులు లేని హెూటల్స్ నిర్వాహకులకు నోటీసులు ఇస్తున్నాం. నాణ్యతా ప్రమాణాలు పాటించి కస్టమర్స్ కు మంచి ఆహారం అందించేందుకు మార్పు తెచ్చే విధంగా అవకాశం కల్పిస్తున్నాం. పర్యాటక కేంద్రం అరకులోయలో 4 రెస్టారెంట్లకు త్రీ స్టార్ వరకు హైజిన్ రేటింగ్ ఇచ్చాం.

శిక్షణకు చర్యలు

జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లాలోని ఆశ్రమ స్కూల్స్ హాస్టల్ నిర్వాహకులకు, మిడ్ డే మీల్స్ అంగన్వాడి నిర్వాహకులకు సర్టిఫైడ్ ట్రైనింగ్ ప్రోగ్రాం 2 వేల మందికి లక్ష్యంగా శిక్షణ ఇచ్చేందుకు చర్యలు చేపట్టాము. ముందుగా పాడేరు మండలంలో స్కూల్స్ హెచ్ఎం లు డిప్యూటీ వార్డెన్ లు కుక్ లు మొత్తం 250 మందికి ఆన్లైన్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ నిర్వహించాం. ఆశ్రమ వసతి గృహాల్లో తనిఖీలు నిర్వహించి ఆహార పానీయ సరఫరాల్లో లోపాలను గుర్తించి ఫుడ్ స్టోరేజీ కి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వేడి తాగునీరు సరఫరా వంటి చర్యలతో ఆహార పానీయాలు భద్రతపై చర్యలు తీసుకున్నాం.

సాయిరాంకు ఘన సన్మానం

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులుగా కిల్లో సాయిరాంను నియమించింది. ఆదివారం స్వగృహంలో టీడీపీ సీనియర్ నాయకుడు కిల్లో శ్యామ్ మర్యాదపూర్వకంగా కలిసిన సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సాయిరాం మాట్లాడుతూ టిడిపి పార్టీలో కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్క కార్యకర్తకి తగిన గుర్తింపు ఉంటుందని గుర్తు చేశారు.గిరిజన హక్కులు చట్టాలను బలోపేతం దిశగా అడుగులు వేస్తూ గిరిజన ప్రజలు అభివృద్ధి కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చినలబుడు పంచాయతీ టిడిపి నాయకులు గొల్లూరి రాజు, భగత్‌రామ్ గుండన్న పాల్గొన్నారు.



సన్మానిస్తున్న నాయకులు

వింత వ్యాధితో విలవిల

కాళ్లు, కీళ్ళు కదపాలంటే నరకం. కాళ్ల నొప్పులు, కీళ్ల వాపులకు వయస్సుతో సంబంధం లేదు. ఆ గ్రామాల్లో రెండు నెలల పసికందు నుంచి 70 యేళ్ల వృద్ధుడి వరకూ అందరికీ ఒక్కటే సమస్య. కీళ్లనొప్పులు. అడుగుతీసి అడుగువేయాలంటే ఒకరి తోడు కావాల్సిందే. నరాలు మెలిపెడుతున్న బాధ. మందులు వాడుతున్నా ఫలితం కానరావడం లేదు. ఇది ఏం మాయదారి జబ్బో అర్థం కావడం లేదని పలువురు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- మంచం పట్టిన గిరిజన పల్లెలు
- కీళ్లవాపులు, నొప్పులతో నడవలేక అవస్థలు
- పసికందులనూ వదలని వ్యాధి
- మూడు నెలలుగా కానరాని పూర్తిస్థాయి చికిత్స
- పట్టించుకోని ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు



మంచంపై లేవలేని స్థితిలో పార్వతి, నూకరాజు



రెండు నెలల పసికందుతో సహా వ్యాధి బారిన పడ్డ కుటుంబం

ప్రజాశక్తి- రాజవొమ్మంగి : మండలంలోని లాగరాయి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో లబ్బర్తి, కిండ్ర, లాగరాయి, కిర్రాబు, గడువుకుర్తి పంచాయతీలకు చెందిన 8,394 మంది జనాభా ఈ పిహెచ్‌సిపై ఆధారపడి ఉన్నారు. గత మూడు నెలలుగా లాగరాయి, కిండ్ర, లబ్బర్తి పంచాయతీ గ్రామాల్లోని ప్రజలు కీళ్ళనొప్పులు, కీళ్ళవాపులతో తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారు. అసలు ఆ గ్రామాల్లో ఏం జరుగుతుందో తెలియని అయోమయ పరిస్థితి నెలకొందని గిరిజనులు వాపోతున్నారు. కిండ్ర గ్రామంలో రెండు నెలల పసికందును సైతం ఈ వ్యాధి పట్టిపీడిస్తోందని గ్రామస్తులు వాపోతున్నారు. కిండ్ర గ్రామానికి చెందిన కె.నాగరాజు, ఆర్.లక్ష్మి, ఎన్.లక్ష్మి, ఎన్.పార్వతి, ఎన్.నూకరాజు, రుత్తల అచ్చయ్యమ్మ తదితరులు ఇదే వ్యాధితో బాధపడుతూ లేవలేని స్థితిలో ఉన్నారు. అదేవిధంగా లాగరాయి, కిండ్రకాలనీ గ్రామానికి చెందిన అనేకమంది కీళ్లనొప్పులు, వాపులతో బాధపడుతున్నారు. ఈ వ్యాధితో ఆసుపత్రికి ఎన్నిసార్లు వెళ్లినా వైద్యాధికారులు పరిశీలించి మందులు ఇస్తున్నారు తప్ప అవి తగ్గలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలలుగా ప్రభుత్వం కూడా పట్టించుకోవడం లేదంటూ గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. లాగరాయి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లినా అక్కడ వైద్యులు తాత్కాలికంగా చికిత్స అందించి రక్తనమూనాలు తీసుకుని పరీక్షలకు పంపిస్తామని చెప్పి నొప్పులకు మందులు ఇచ్చి పంపిస్తున్నారు. దీంతో ఏం చేయాలో తెలియని పరిస్థితిలో కొంతమంది ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించి వేలాది రూపాయలు ఖర్చు చేసుకొని చికిత్స పొందుతున్నారని గిరిజనవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జూన్‌లో లాగరాయి పిహెచ్‌సి పరిధిలో ఒక చికున్‌గున్యా పాజిటివ్ కేసు నమోదైందని ఇలా చికున్‌గున్యా సోకిన వారికి దానికి సంబంధించిన లార్వా ఉండటం వల్లనే వ్యాధికి గురైన రెండు మూడు నెలల వరకూ కీళ్ల నొప్పులు, వాపులు ఉంటాయని వైద్యులు తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి తక్షణం ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహించాలి



కీళ్లనొప్పులు, కీళ్లవాపులు, జ్వరం వంటి సమస్యతో సతమత మవుతున్న లాగరాయి పిహెచ్‌సి పరిధిలోని గ్రామాల్లో తక్షణం ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహించాలి. బాధితులకు పూర్తిస్థాయి వైద్య సహాయం అందజేయాలి. లేదంటే ఆందోళన చేపడతాం.

- కొండ్ల సూరిబాబు, సిపిఎం మండల కార్యదర్శి

ప్రజారోగ్యం పట్టని ప్రభుత్వం



ప్రజారోగ్యం గురించి ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. తరచూ ఏజెన్సీలో పలువురు అనారోగ్యం బారిన పడి మృతి చెందుతున్నారు. ఐటిడిఎ, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు స్పందించడం లేదు. తక్షణం హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి. లేకుంటే గిరిజనులను ఐక్యంచేసి పోరాడుతాం.

-లోతా రామారావు, ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు

వైద్య శిబిరాలు నిర్వహించాలి




రోజురోజుకూ గ్రామాల్లో కీళ్ల నొప్పులు,కీళ్ల వాపులు,జ్వరాలు బారిన పడుతున్న వారి సంఖ్య ఎక్కువవుతున్న నేపథ్యంలో గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి బాధలు తొలగించాలి.

-ఆర్.లక్ష్మి, ఎన్.లక్ష్మి

ఆరోగ్య సిబ్బంది పర్యవేక్షణ

ప్రజలు కీళ్లనొప్పులు కీళ్లవాపులతో బాధపడుతున్న నేపథ్యంలో గ్రామాల్లో నిరంతరం వైద్యసిబ్బంది పర్యవేక్షించి రోగుల పట్ల అప్రమత్తతో బాటు గ్రామాల్లో ప్రజారోగ్యంపై అవగాహన సదస్సులు పెడుతున్నాం. గ్రామాల్లో దోమలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రజలు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. పరిశుభ్రత పాటించాలి.

- శరత్‌చంద్ర, లాగరాయి పిహెచ్‌సి వైద్యాధికారి



కూరగాయలు పంపిణీ చేస్తున్న ట్రస్టు సభ్యులు

ముంపు బాధితులకు కూరగాయల పంపిణీ

ప్రజాశక్తి- వి.ఆర్‌పురం: మండలంలోని చొక్కనపల్లి (కొత్తూరు), కల్తూనూరు గ్రామాల్లో జై హనుమాన్ బోట్‌లో గోదావరి మీదుగా వెళ్లి ముంపు గ్రామాలను సర్పంచ్ పులి సంతోష్‌కుమార్ ఓంకార్ చారిటబుల్ ట్రస్ట్ వారు సందర్శించి సంస్థ ఆధ్వర్యంలో బాధితులకు కూరగాయలు అందించారు. గత 20 రోజులుగా పనుల్లేక గహాల చుట్టూ వరద చేరడంతో గుట్టలపై పాకలు వేసుకొని ఆకలితో జీవించారని మూడు గ్రామాల బాధితులకు సుమారు 350 మందికి కుటుంబాలకు సర్పంచ్ పులి సంతోష్‌కుమార్ పిటిసి వాళ్ళ వెంకటేశ్వర రెడ్డి సొసైటీ అధ్యక్షుడు గొంది చంద్రయ్య అందించారు. వరద బాధితులు సర్పంచ్‌కి ఓంకార్ చారిట్రబుల్ ట్రస్ట్ వారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఓంకార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎన్.బి. బాలస్వామి, సిపిఎం నాయకులు పోడియం శ్రీరామ మూర్తి, సోడే మల్లయ్య వై.ఆనంద్ పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు టివిఆర్ చంద్రం



నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-కూనవరం: టివిఆర్ చంద్రం చిరస్మరణీయుడు అని రైతు సంఘం నాయకులు నాగరాజు అన్నారు. స్థానిక శ్రీమార్త శ్రీరామ్మూర్తి భవన్‌లో సిపిఎం సీనియర్ సభ్యులు నోముల సత్యనారాయణ, టివిఆర్ చంద్రం వర్ధంతి సందర్భంగా పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ చంద్రం ఆరు దశాబ్దాల రాజకీయ జీవితం కమ్యూనిస్టు ఉద్యమంలో భద్రాచలం డివిజన్ ఖమ్మం జిల్లా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాధ్యతలలో కొనసాగారన్నారు. భద్రాచలం డివిజన్‌లో 1952 కామ్రేడ్ చంద్రం ఎం.డి.తహసిల్, గర్నేటి సుబ్బారావు, ఉప్పు సూర్యనారాయణ, బెల్లం కొండ నరసింహారావు, కూనవరంలో ఏర్పడిన భారత కమ్యూనిస్టు పార్టీ మొట్ట మొదటిశాఖ కార్యదర్శిగా పనిచేసారన్నారు. అంతకుముందే 1947 ఐదు సంవత్సరాల పాటు కమ్యూనిస్టు పార్టీ రహస్య దళాలతో సంబంధాలు కలిగి ఉన్నారని పేర్కొన్నారు. రెండు దశాబ్దాలకు పైగా భద్రాచలం డివిజన్ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో కొండా ఈశ్వర్లు, మండల కమిటీ సభ్యులు తాళ్లూరి శ్రీనివాసరావు, మహిళా నాయకురాలు సుధారాణి, తాళ్లూరి రామారావు తదితరులు పాల్గొన్నారు

ఏజెన్సీ ఉపాధ్యాయులకు ఘన సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంపిడిఒ విజయ్, డిఇఒ మల్లేశ్వరరావు



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ గోపిమూర్తి, మాజీ ఎంపీ అరుణ్ కుమార్

ప్రజాశక్తి -రాజవొమ్మంగి: ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి పురస్కరించుకొని తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి పాన్ ఇండియా సోషియోకల్చర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధ్యా య దినోత్సవంలో ఆదివారం అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఏజెన్సీ ఏరియాలో పనిచేస్తున్న రాజవొమ్మంగి మండల జెడ్పి పాఠశాల, జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న పిజిటి తెలుగు ఉపాధ్యాయులు తీగల బొజ్జియ్య, ఎల్లవరం హైస్కూల్‌లో ఇంగ్లీష్ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న సారపు చినబాబు దొర సేవలను గుర్తించి ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి, మాజీ పార్లమెంటు సభ్యులు ఉండవల్లి అరుణ్ కుమార్, కాకినాడ స్పెషల్ కలెక్టర్, రాజమండ్రిలోని ప్రముఖ వ్యక్తులు పాన్ ఇండియా సోషియో అసోసియేషన్ వ్యవస్థాపకులు అద్దంకి రాజాయోన, రంపచోడవరం ఏజెన్సీ జిల్లా విద్యాశాఖాధికారి మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకష్ణ మెమొంటో సర్టిఫికెట్స్‌తో సత్కరించారు.

ఘనంగా గురుపూజోత్సవం

అడ్డతీగల: స్థానిక మండల కేంద్రం ఎంఈఓ కార్యాలయం వద్ద ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపిడిఒ విజయ్, ఏజెన్సీ డిఇఒ మల్లేశ్వరరావు హాజరయ్యారు. అడ్డతీగల ఎంఇఒ రమేష్, ఎంఇఒ 2 శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. జిల్లా, డివిజన్ మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయులకు ఎంపిడిఒ, ఏజెన్సీ డిఇఒ సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో ఉత్తమ పౌరులను తీర్చిదిద్దాలంటే అది ఒక్క ఉపాధ్యాయుని వల్ల మాత్రమే సాధ్యమవుతుందన్నారు. ఎంతోమంది గొప్పగొప్పవాళ్లను వారు మాత్రమే తీర్చిదిద్దగలరన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన అందరికీ ఈ సందర్భంగా డిఇఒ ఏజెన్సీ ఎంపిడిఒ శుభాకాంక్షలు తెలిపారు. యుటిఎఫ్ సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు.

డొంకరాయి జలాశయం నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

ప్రజాశక్తి -సీలేరు: సీలేరు కాంప్లెక్స్ పరిధి డొంకరాయి జలాశయం నుంచి 1000 క్యూసెక్కుల నీటిని గేట్లు ద్వారా దిగు ప్రాంతానికి కొనసాగుతుందని ఎపి జెన్కో ఎడిఇ శ్రీనివాసరావు తెలిపారు. ఆయన 'ప్రజాశక్తి'తో ఆదివారం మాట్లాడుతూ గురువారం రాత్రి జలాశయంలో నీటిమట్టం 1035.10 చేరుకోవడంతో డొంకరాయి డ్యామ్ గేట్లు ద్వారా శుక్రవారం రాత్రి 10 గంటల నుంచి శనివారం ఉదయం 10 గంటల వరకూ 3వేల క్యూసెక్కులు నీటిని దిగువ ప్రాంతానికి విడుదల చేసామని పేర్కొన్నారు. ఇన్ఫ్లోస్ తగ్గడంతో శనివారం ఉదయం 10.30 నుంచి జలాశయంలో నీటిమట్టాలు కాస్త తగ్గాయని తెలిపారు. ఎపి జెన్కో అధికారుల ఆదేశాల మేరకు 3వేల క్యూసెక్కులలో 2వేల క్యూసెక్కులు నీటిని తగ్గించి 1000 క్యూసెక్కులు నీటిని మాత్రమే శనివారం ఉదయం నుంచి దిగువ ప్రాంతానికి యధాతథంగా విడుదల చేస్తున్నామన్నారు. ప్రస్తుతం జలాశయంలో 1034.60 అడుగులు నీటిమట్టంతో జలాశయం స్థిరంగా ఉందన్నారు. డొంకరాయి పవర్ కెనాల్ నుంచి పొల్లూరు జలవిద్యుత్ కేంద్రానికి విద్యుత్ ఉత్పత్తి నిమిత్తం 4000 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నామని తెలిపారు.



గౌరవాధ్యక్షులు మంజుల



అధ్యక్షులు కళావతి



కార్యదర్శి సుమిత్ర

అంగన్వాడీ యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- అనంతగిరి: అంగన్వాడీ మండల గౌరవ అధ్యక్షులుగా పి.మంజుల, అధ్యక్షులుగా సిహెచ్. కళావతి, కార్యదర్శిగా సాగర .సుమిత్ర ఏకగ్రీవంగా ఎన్నియ్యారు. స్థానిక గిరిజన సంఘంలో ఆదివారం మండల అంగన్వాడీ యూనియన్ మహాసభ పి.మంజుల అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అంగన్వాడీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు సీహెచ్. కళావతి మాట్లాడుతూ, దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న తమస్యపై రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు గత ఏడాది 42 రోజులుగా సమ్మె చేసి అనేక సమస్యలు పరిష్కారం చేసుకొన్నామని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని పోరాటానికి సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. కనిస వేతనం 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం 21 మందితో మండల నూతన మండల కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్వతి, చిలకమ్మ, సునీత, సరస్వతి .తదితరులు పాల్గొన్నారు



అవగాహన కల్పిస్తున్న అధికారులు

బెర్రీ బోరర్‌పై కాఫీ రైతులకు అవగాహన

ప్రజాశక్తి-హుకుంపేట:మండలంలోని కోట్నా పల్లి, ఓల్డ, బాకూరు, పంచాయతీ మారేలా తదితర గ్రామాలో హర్టి కల్చర్, ఫీల్డ్ కన్సల్టెంట్ సిబ్బంది ఆదివారం పర్యటించి కాఫీ తోటల్లో బెర్రీ బోరర్ వ్యాధి సోకకుండా ఉండేందుకు అవగాహన సదస్సులు నిర్వహించారు. హర్టి కల్చర్ కన్సల్టెంట్ కె.వాణి, ఫీల్డ్ కన్సల్టెంట్ పార్వతీశం, కె.రత్నలమ్మ, మండలం కోర్డినేటర్ గోవిందు పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఒక తోటకు ఈ వ్యాధి సోకితే పక్కన ఉన్న వందల ఎకరాల వ్యాపించే ప్రమాదం ఉందన్నారు. పంచాయతీలలో పనిచేస్తున్న కాఫీ లైజన్ వర్కర్లు మండలంలోని పలు గ్రామాలను సందర్శించి సదస్సులు నిర్వహించారని చెప్పారు. ప్రతి రైతు కూడా తోటల పరిశీలనలో అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. వ్యాధి సోకినట్లయితే మొత్తం తోటలు నాశనం కావడంతో పాటు దిగుబడులు గణనీయంగా తగ్గిపోతాయని, మెరుగైన కాఫీ ఉత్పత్తి సాధ్యం కాదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కాఫీ లైజన్ వర్కర్లు కె వాసు, బి.నారాయణ, సిచ్ సత్యనాదం, జె బొంజుబాబు, ఎం.కొండలరావు, కాఫీ సిబ్బంది పాల్గొన్నారు.

పరారైన రిమాండ్ ఖైదీల అరెస్ట్

ప్రజాశక్తి- అనకాపల్లి : చోడవరం సబ్‌జైల్ హెడ్‌వార్డర్ వాస వీర్రాజుపై దాడి చేసి పరారైనరిమాండ్ ఖైదీలను అరెస్టు చేసినట్టు జిల్లా ఎస్‌పితుహిన్ సిన్హా వెల్లడించారు. ఆదివారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో డిఎస్‌పి ఎం.శావణితో కలిసి మీడియాతో మాట్లాడారు. ఈనెల 5న, చోడవరం సబ్ జైల్‌లో రిమాండ్ ఖైదీలుగా ఉన్న నక్క రవికుమార్, బెజవాడ రాము, యాక స్వామి జైలు హెడ్‌వార్డర్ వీర్రాజుపై సుత్తితో దాడి చేసి గేటు తాళాలు తీసిపరారయ్యారు. ఈ క్రమంలో ఎఎస్‌ఐ కృష్ణమూర్తి మొబైల్ ఫోను కూడా దొంగలించుకు పోయారు.ఈ ఘటన అనంతరం, లుకౌట్ నోటీసులు జారీ చేసిప అనకాపల్లి జిల్లా పోలీసులు, సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేసారు. వాహన తనిఖీలతో గాలింపు చేపట్టారు ఈనెల 6న విశాఖపట్నం సిటీ టాస్క్‌ఫోర్స్ పోలీసులు గొల్లలపాలెం జంక్షన్ ఎస్‌బిఐ వద్ద పరారైన ఇద్దరు నిందితులను పట్టుకొని, చోడవరం పోలీసులకు సమాచారమిచ్చారు. మధ్యవర్తుల సమక్షంలో విచారణలో నిందితులిద్దరూ నేరాన్ని అంగీకరించారు.

మన్యంలో జొల్ల పండగ సందడి

వరి నాట్లు పూర్తయిన తర్వాత తొలి వ్యవసాయ పండుగ

ప్రజాశక్తి- పాడేరు టౌన్: మన్యంలోని ప్రతి ఆచార వ్యవహారం వైవిధ్యంగానే ఉంటుంది. దీని వెనుక సంప్రదాయం, శాస్త్రీయత ఉంటాయి. ఆ కోవకే చెందుతుంది గిరిజనులు ఆచరించే 'జొల్ల పండగ'. గిరిజన ప్రాంతాల్లో వరినాట్లు పూర్తయిన మూడు వారాల్లో కొర్రకొత్త పండుగ అనంతరం గ్రామ పెద్దలు నిర్ణయించిన రోజున ఈ జొల్ల పండుగ నిర్వహించడం ఆనవాయితీ. దీంతో పంట పొలాల్లో జొల్ల పండగ సందడి నెలకొంది. మైదాన ప్రాంతాలకు భిన్నంగా, ఇతరులకు ఆసక్తి కలిగేలా గిరిజనుల ఆచార వ్యవహారాలు ఉంటాయి. వాటిపై గిరిజనులు తరతరాలుగా విశ్వాసం ఉంచి, పాటిస్తూనే ఉన్నారు. అటువంటి వ్యవహారాల్లో ఒకటి జొల్ల పండగ. ఇందులో భాగంగా అటవీ ప్రాంతాల్లో లభించే కొసిమి, జీలుగు, సీత తదితర ఔషధ మొక్కలను గిరిజనులు సేకరించి ఆయా కొమ్మలను గ్రామంలో ప్రత్యేక పూజలు జరిపి, కోడిపిల్ల రక్తంతో కలిపిన అక్షింతలు, రైతుల ఇళ్లల్లో తయారీ చేసిన పిండి వంటలు, నైవేద్యం, కొబ్బరికాయ ఇతర సామాగ్రితో పాటు జొల్ల కొమ్మలతో పంటపొలాల్లో పూజలు నిర్వహిస్తారు. అనంతరం జొల్ల కొమ్మలను నాటి, ఆయా అక్షింతలు పొలాల్లో నాలుగు దిక్కుల చల్లుతారు. ఈ విధంగా చేయడంతో పంటలకు చీడపీడల రక్షణతో పాటు దిగుబడులు వస్తాయని గిరిజన రైతుల నమ్మకం. పంట పొలాల్లో విందు భోజనాలు చేసి సందడి చేస్తారు. ప్రతి గిరిజన రైతు విధిగా ఈ పండగను నిర్వహించాలనే నిబంధన తరతరాలుగా కొనసాగుతుంది. దీంతో వరి సాగు చేసే ప్రతి రైతు కచ్చితంగా ఈ పండగను చేస్తారు.

పండగ వెనుక శాస్త్రీయత..

సంప్రదాయంగా గిరిజనులు నిర్వహించే జొల్ల పండగ వెనుక శాస్త్రీయత దాగి ఉందని పలువురు పూర్వీకుల అభిప్రాయం. ఈ సంప్రదాయ పండగలో భాగంగా రైతులు పొలాల్లో పాతే మొక్కల కొమ్మలు ఔషధ గుణాలు కలిగినవని గిరి రైతులు అంటున్నారు. ఔషధ గుణాలు కలిగిన కస్సి, సీడి, పెద్ద జొల్ల మొక్కల కొమ్మలను పంట పొలాల్లో పాతడంతో లేత వరి పైరును ఆశించేందుకు వచ్చే పలు రకాల పురుగులను ఈ కొమ్మలు ఆకర్షించి వరి పంటను కాపాడుతాయని పలువురు చెబుతున్నారు. అయితే సస్యరక్షణలో భాగంగా చేపట్టాల్సిన ఈ చర్యను సంప్రదాయం, ఆచారాల్తో కలిపి చేయడంతో గిరిజనులు పండగగా భావించి, విధిగా దానిని పాటిస్తూనే ఆలోచనతో పూర్వీకులు జొల్ల పండగగా నామకరణం చేసి ఆచరిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. దీంతో ఈ ఆచారాన్ని తరతరాలుగా కొనసాగిస్తున్నామని పలు గ్రామాలకు చెందిన పెద్దలు, గిరిజన రైతులు తెలిపారు.



పొలంలో జొల్ల మొక్కలు తీసుకుని వెళుతున్న గిరిజన రైతు

హైడ్రో పవర్ ప్రాజెక్టులను రద్దు చేయాలి



హైడ్రో పవర్ ప్రాజెక్టు ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలిస్తున్న సురేంద్ర

ప్రజాశక్తి-హుకుంపేట :మండలంలోని భుర్జ పంచాయతీ చాపరాయి వలసలో ప్రతిపాదిత హైడ్రో పవర్ ప్రాజెక్టు అప్పర్ డ్యాం నిర్మాణ ప్రాంతాన్ని ఆదివారం ఆదివాసి గిరిజన సంఘం హైడ్రో పవర్ ప్రాజెక్టు వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, జిల్లా కార్యదర్శి పీ.బలదేవ్, కమిటీ కన్వీనర్ మజ్జి సురేష్‌కుమార్ మాట్లాడుతూ, భుర్జ పంచాయతీలో నిర్మిస్తున్న హైడ్రో పవర్ ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ రిపోర్టును బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 18న ప్రారంభమయ్యే రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో ఏజెన్సీ ఎమ్మెల్యేలు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, ప్రాజెక్టును వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. జీవో 51ను తక్షణమే రద్దు చేయాలని కోరారు. ఈ ప్రాజెక్ట్‌తో భుర్జ, జన్ని, వెంగడ పంచాయతీలు పూర్తిగా జలమయం అవుతాయన్నారు. అనంతగిరి మండలంలోని జీనబాడు, వాలసి, పెదబిడ్డ, లంగుపర్తి పంచాయతీ పరిధి గ్రామాలు కూడా ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. 5వ షెడ్యూల్ ప్రాంతంలో ప్రైవేట్ సంస్థలకు అనుమతులు ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధమని తెలిపారు. 1/70 చట్టం, అటవీ హక్కుల చట్టం, పీసా చట్టం ప్రకారం నిషేధమని గుర్తు చేశారు. గెడ్డ నీటిని ప్రాజెక్టు కోసం వినియోగిస్తే అనంతగిరి మండలంలో తీవ్ర నీటి కొరత ఏర్పడి, గిరిజన రైతుల భూములు బీడు భూములుగా మారిపోతాయని తెలిపారు. గిరిజనుల మనుగడకే ముప్పు పొంచి ఉందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో భుర్జ పంచాయతీ ఎంపీటీసీ మజ్జి హరి, పోరాట కమిటీ కో-కన్వీనర్ మజ్జి కృష్ణం రాజు, నాయకులు కొర్ర బొంజుబాబు, వైస్ చైర్పర్సన్ ఎస్.లక్ష్మీ, వెంగడ మాజీ చైర్పర్సన్ ఎస్.కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కుక్క దాడిలో విద్యార్థికి గాయాలు

ప్రజాశక్తి-హుకుంపేట :మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న విద్యార్థి బురిడీ నవనీత్‌ను పిచ్చికుక్క దాడి చేసి గాయపరిచింది. స్కూల్ పక్కనే ఉన్న దుకాణానికి సామాన్లు కొనడానికి వెళ్లి వస్తుండగా, కుక్క అతనిపై దాడి చేసి కుడిచేయిని గాయపరిచింది. గమనించిన స్థానికులు వెంటనే విద్యార్థిని ఆసుపత్రికి తరలించారు. పిచ్చికుక్కల సమస్యపై తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను పలువురు కోరారు.



గాయపడిన విద్యార్థి

'మేఘాద్రి'లో ఇద్దరు యువకులు మృతి

ప్రజాశక్తి-పెందుర్తి: మేఘాద్రి రిజర్వాయర్‌లో ఆదివారం ఇద్దరూ యువకులు మృతిచెందారు. సిఐ సతీష్‌కుమార్ కథనం ప్రకారం... బల్లంకి వాసు, బల్లంకి శేఖర్, యేడాడ లక్ష్మణ్‌కుమార్ యార్డ్‌లో కాంట్రాక్ట్ పనులు చేస్తున్నారు. ఆదివారం సెలవు కావడంతో మేఘాద్రిలో చేపలు పట్టడానికి ఉదయం సుమారు 11:30 గంటల సమయంలో వెళ్లారు. జెఎన్‌ఎన్‌యుఆర్‌ఎం కాలనీకి చెందిన బల్లంకి శేఖర్ (18), చిన్నముషిడివాడ ఆక్సిజన్ కాలనీకి చెందిన యేడాడ లక్ష్మణకుమార్ (18) ప్రమాదవశాత్తు నీటిలో మునిగి గల్లంతయ్యారు. సమాచారం తెలుసుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. సీనియర్ గజ ఈతగాళ్లను మేఘాద్రి డ్యామ్‌లోకి దించి గాలింపు చేపట్టారు. ఇద్దరి మృతదేహాలను వెలికితీసి కేసు నమోదు చేశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. ఈ ప్రాంతం వైపుకు రావద్దని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా యువత విస్మరించడం సరికాదని పలువురు అంటున్నారు.



గిరిజనులతో మాట్లాడుతున్న ఎస్ఐ రమణ

గంజాయిని దరి చేరనీయొద్దు

- మారుమూల గ్రామాల గిరిజనుల స్వచ్ఛంద నిర్ణయం
- హర్షం వ్యక్తం చేసి స్వాగతించిన పోలీసులు

ప్రజాశక్తి- పెదబయలు : గంజాయికి వ్యతిరేకంగా మారుమూల మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో గిరిజనులంతా స్వచ్ఛందంగా ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దల సమక్షంలో మంచి నిర్ణయాలు తీసుకోవడం అభినందనీయమని స్థానిక ఎస్ఐ కె.రమణ అన్నారు. ఆ దివారం జామిగుడ, గిన్నెలు కోట, బొంగరం, లింగేటి, కుంతుర్ల , గోమంగి గ్రామ పంచాయతీలోని గ్రామస్థులంతా ఆయా పంచాయతీల సర్పంచ్‌ల ఆధ్వర్యంలో గంజాయి సాగు, రవాణా, నిల్వ చేయడానికి దూరంగా ఉండాలని, తమ గ్రామాలకు చెడ్డపేరు తేవడంతో పాటు ప్రజలను కేసులుపరంగా, ఇతరత్రా ఆర్థికంగా ఇబ్బందులు గురిచేస్తున్న గంజాయికి దూరంగా ఉండాలని తీర్మానించారు. గంజాయి వల్ల గిరిజన ప్రాంతంలో ఒక కుటుంబమైనా బాగుపడిన దాఖలాలు లేవని, సరికదా, దీన్ని కొనసాగిస్తే భవిష్యత్ మరింత మంది కేసులపాలై జైల్లో మగ్గాల్సిన దుస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గంజాయికి ప్రత్యామ్నాయంగా పంటలసాగుతోపాటు గిరిజన బాలలను బాగా చదివించి, వారి భవిష్యత్‌ను మంచిమార్గంలో పెట్టేందుకు కృషి చేయాలని నిర్ణయించారు. గ్రామసభలోజామిగుడ, బొంగరం, లింగేటి, గిన్నెలు కోట, కుంతుర్ల , గోమంగి సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, వైస్ సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, పీసా కమిటీ సభ్యులు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వరదల్లో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-కొయ్యూరు : వరదలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కొయ్యూరు మండల వైసిపి అధ్యక్షులు బిడిజన అప్పారావు అన్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు ఎరువులు పంపిణీ చేయడంలో కానీ ఇటీవల వరద ప్రభావంతో నష్టపోయిన పొలాలకు నష్టపరిహారం కల్పించకపోవడం ఇతర సమస్యల గురించి తీవ్ర ఇబ్బందులకు గురైన రైతులకు బాసటగా ఈ నెల 9న కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమానికి కొయ్యూరు మండల పార్టీ అధ్యక్షులు, ఎంపిపి, జెడ్‌పిటిసి, రాష్ట్ర, జిల్లా, మండల, అనుబంధాలు విభాగాల నాయకులు, వైస్ ఎంపిపి, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు, మాజీ మండల వైసిపి అధ్యక్షులు, మండల ఉపాధ్యక్షులు, మండల కార్యదర్శుల ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందని అంతా హాజరు కావాలన్నారు.



వాగు దాటి వెళుతున్న గ్రామస్తులు

గొట్టెలపాడు వాగుతో రాకపోకలకు అంతరాయం

ప్రజాశక్తి -కొయ్యూరు : మూడు రోజుల పాటు కురిసిన భారీ వర్షాలకు కొండవాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. యూ.చీడిపాలెం పంచాయతీ పరిధిలోని గొట్టెలపాడు కొండవాగు రహదారి పైనుంచి ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లేవారు, ప్రమాదకర పరిస్థితుల్లో వాగు దాటి వెళ్తున్నారని గొట్టెలపాడు వాగు పొంగితే 12 గ్రామాల ప్రజలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని గ్రామస్తులు తెలిపారు.

ఉపాధి పనుల బిల్లులు చెల్లించాలి

ప్రజాశక్తి- కూనవరం: మండలంలోని రేగులపాడులో శాఖ సమావేశం బొగ్గా సుబ్బయ్య అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరావు హాజర య్యారు. ఇటీవల మృతి చెందిన తిమ్మ నాగిరెడ్డి, సయ్యద్ జియాఉద్దిన్‌లకు సంతాపం తెలియజేసారు. అనంతరం రేగులపాడు సర్పంచ్ బొగ్గా రామారావు మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని ప్రజలు పలువురు 6 నెలలుగా ఉపాధి పని చేసిన వారికి ఇంతవరకూ డబ్బులు పడక చాలా బాధాకరమన్నారు. ఉపాధి బిల్లుల సమస్య పరిష్కారం కోసం ఉద్యమం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు మండల కమిటీ సభ్యులు బొగ్గా సుబ్బయ్య, వార్డ్ మెంబర్ బొగ్గా సుబ్బమ్మ, శాఖ సభ్యులు గుండం బాబురావు, గుండం బుచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

యూరియా వాడకంపై గ్రామసభ

ప్రజాశక్తి- చింతూరు: కల్లేరు గ్రామంలో యూరియా వాడకంపై ఆదివారం గ్రామసభ నిర్వహించారు. వ్యవసాయాధికారి రత్నప్రభ మాట్లాడు తూ వరిలో యూరియా వాడకం తగ్గించ మని, మోతాదు మించి ఎరువులను వాడకూడదని, ప్రకతి వ్యవసాయం చేయమని తెలిపారు. యూరియా గురించి ఆందోళన వద్దని రైతుసేవా కేంద్రాల వారీగా యూరియా సరఫరా చేస్తామని చెప్పారు. చింతూరు చదల వాడ ఆర్ఎస్‌కేలో 20 టన్నుల యూరియా, 7 టన్నులు డిఎపి సరఫరా చేశామని ఏడుగురాళ్లపల్లి, గూడూరు సచివాలయాలకు మొత్తం 55 టన్నులు యూరియా అందించామన్నారు.అన్ని సచివాలయాల్లో ఆర్ఎస్‌కె సిబ్బంది కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామసభలు నిర్వహించారు. రైతులందరూ తప్పనిసరిగా ఈక్రాప్ ఈపంట నమోదు చేయించుకోవాలని సూచించారు.



గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

ఏజెన్సీలో భారీ వర్షం

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం సీలేరులో మధ్యాహ్నం 3 గంటలకు భారీ వర్షం కురవడంతో వారపు సంతకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. శనివారం వేసవిని తలపించే విధంగా ఎండలు మండాయి. ఆదివారం వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని సాయంత్రం మూడు గంటలకు భారీవర్షం కురవడంతో సంతలో నిత్యావసర సరుకులు కొనుగోలు చేయడానికి వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనులు వారి ఇళ్లకు వెళ్లేందుకు ఇబ్బందులకు గురయ్యారు.

వెలవెలబోయిన వారపు సంత

కొయ్యూరు: మండలంలో ఆదివారం మధ్యాహ్నం కురిసిన భారీవర్షానికి రాజేంద్రపాలెం వారపు సంత బోసిపోయింది. రాజేంద్రపాలెంలో ప్రతి ఆదివారం సంత జరుగుతుంది. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, ముఖ్యంగా మారుమూల గ్రామాల ప్రజలు వారపు సంతకు తరలి వచ్చి నిత్యావసరాలు కొనుగోలు చేస్తారు. అయితే ఆదివారం వర్షం కురవడంతో సంత వెలవెలబోయింది. వ్యాపారంపై ప్రభావం చూపిందని వ్యాపారులు ఆవేదన చెందుతున్నారు.



సీలేరులో కురుస్తున్న వర్షం

విశాఖ రైల్వే స్టేషన్‌కు ప్లాటినం గ్రీన్ రైల్వే సర్టిఫికేషన్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలోని విశాఖపట్నం రైల్వే స్టేషన్‌కు గ్లోబల్‌గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ ద్వారా అత్యధిక ప్లాటినం రేటింగ్‌తో ప్రతిష్టాత్మకమైన 'గ్రీన్ రైల్వేస్టేషన్ సర్టిఫికేషన్' లభించింది. ఈ గుర్తింపు స్టేషన్ పర్యావరణ అనుకూల పద్ధతులు, పర్యావరణ ప్రభావాన్ని తగ్గించే లక్ష్యంతో స్థిరమైన భావనలను అవలంభించడం ద్వారా లభించింది. ఈ సర్టిఫికేషన్ సాధించడంలో అంకితభావంతో పనిచేసిన అధికారుల బృందాన్ని వాల్టేర్ డివిజనల్ రైల్వేమేనేజర్ లలిత్‌బోహ్రా అభినందించారు. గ్రీన్ రైల్వేస్టేషన్ రేటింగ్ వ్యవస్థను భారతరైల్వే పర్యావరణ డైరెక్టరేట్, (గ్లోబల్ గ్రీన్‌బిల్డింగ్ కౌన్సిల్) సహకారంతో అభివృద్ధి చేసింది. నీటి సంర క్షణ, శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణ, ఇంధన సామర్థ్యం, శిలాజ ఇంధనా లపై ఆధారపడటం తగ్గించడం, సహజ పదార్థాల కనీస వినియోగం, ప్రయాణీకులు, సిబ్బంది ఆరోగ్యం, శ్రేయస్సును ప్రోత్సహించడం వంటి జాతీయ ప్రాధాన్యత కలిగిన అంశాలను పరిగణలోకి తీసుకుని ఈ గుర్తింపు అందిస్తారు.

ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి అప్పగింత

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సుమారు 79 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి తమ ఇంట్లో గొడవల కారణంగా మనస్తాపం చెంది ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయారని వారి కుటుంబసభ్యులు మహారాణిపేట పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం సాయంత్రం 5:30 గంటలకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, సమాచారం అందిన వెంటనే సిఐ దివాకర్‌యాదవ్, సిబ్బందిని టీమ్స్ ఏర్పాటు చేసి గాలించగా బీచ్‌లో మత్స్యదర్శిని వద్ద అతని ఆచూకీ కనిపెట్టి వారి కుటుంబ సభ్యులకు క్షేమంగా అప్పగించారు.సిఐ దివాకర్‌కు వృద్ధుని కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా మహాత్మాగాంధీ కేన్సర్ ఆసుపత్రి 20 వసంతాల వేడుక

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ 20 ఏళ్ల వేడుకలను ఆదివారం విశాఖలో ఘనంగా నిర్వహించారు. 2025లో కేవలం ఆరు పడకల డే-కేర్ సదుపాయంతో ప్రారంభమైన సంస్థ నేడు తూర్పు భారతదేశంలోనే ప్రముఖ క్యాన్సర్ ట్రీట్‌మెంట్ సెంటర్‌గా అభివృద్ధి చెందింది. ఈ ఆసుపత్రి ముందస్తు నిర్ధారణ, అత్యధిక చికిత్సలు, రిహాబిటేషన్ వంటి విశేషమైన సేవలను అందిస్తోంది. మేనేజింగ్ డైరెక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ ఈ ఆసుపత్రి రాబోయే తరాలకు మార్గదర్శకంగా నిలవాలనే లక్ష్యంతో పనిచేస్తోందని అన్నారు

ఆవిష్కరణ ఆంధ్ర యాప్‌లతో గిన్నిస్ రికార్డ్

ఎంవిపి కాలనీ: స్టార్టప్‌లను ప్రోత్సహించడంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఆంధ్రప్రదేశ్ ఇన్నోవేషన్ సొసైటీతో కలిసి ఆగస్టు 19న విశాఖ వేదికగా ఏర్పాటు చేసిన ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ /స్టార్టప్/ బిజినెస్ ప్రోగ్రాంకు ఆన్‌లైన్ సైనప్ చేసినందుకు వరల్డ్ రికార్డ్ సృష్టించిందని ఎపి ఇన్నోవేషన్ సొసైటీ సిఇఒ సూర్య ఆదివారం విశాఖలో ప్రకటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం స్టార్టప్ సంస్కృతిని పెంపొందించడం అన్నారు.

19 నుండి ఇన్‌స్టామార్ట్ క్విక్ ఇండియా

ప్రజాశక్తి - విశాఖకలెక్టరేట్ : షాపింగ్ పరంగా సౌలభ్యానికి సంబంధించి ఇన్‌స్టామార్ట్ తమ ప్రారంభ వార్షిక మెగాసేల్, అత్యంత వేగవంతమైన అమ్మకం అయిన ఇన్‌స్టామార్ట్ క్విక్ ఇండియా మూవ్‌మెంట్ 2025' ను ప్రారంభించినట్లు సంస్థ ప్రతినిధి నేస్తాసియా తెలిపారు. నగరంలోని ఒక హోటల్లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఈ అమ్మకం, కొనుగోలుదారులకు వేగవంతమైన డెలివరీతో పాటుగా ఉత్తేజకరమైన ఆఫర్లను సైతం అందిస్తుందని తెలిపారు. ఇంతకు ముందు ఎన్నడూ లేని షాపింగ్ అనుభవాలను సృష్టించే ఈ సేల్ ఈ నెల 19 నుండి 28 వరకూ ఇన్‌స్టామార్ట్ యాప్, స్విగ్గీ యాప్ రెండింటిలోనూ అందుబాటులో ఉండనుందన్నారు. ఈ సేల్ కాలంలో కస్టమర్లు 50-90 శాతం తగ్గింపుతో భారీరాయితీలను ఆశించవచ్చని చెప్పారు. ఎలక్ట్రానిక్స్, కిచెన్, డైనింగ్, బ్యూటీ, పర్సనల్ కేర్, బొమ్మలు మరిన్ని విభాగాల్లో గణనీయమైన తగ్గింపులను సైతం పొందవచ్చు అన్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు మానసిక రోగి

ప్రజాశక్తి -విశాఖకలెక్టరేట్ :

విజయనగరం జిల్లా, బొండపల్లి మండలం, బొటనపల్లి రాజేరు గ్రామానికి చెందిన దేముడు (40) పేదరికం వలన చదువుకోలేదు. చిన్నప్పుడే తల్లి, 2 సంవత్సరాల క్రితం తండ్రి ఇద్దరూ మృతి చెందారు. 10 ఏళ్ళ కిందట బాగా మద్యం సేవించేవాడు. నెమ్మదిగా ఆయన భార్య అలవాటు మాన్పించింది. తండ్రి మృతితో మానసిక ఆరోగ్యం దెబ్బతింది. రోజూ భార్యతో గొడవ పడటంతో పాటు పనికెళ్ళడం మానేశాడు. బయటకు వెళ్ళినే వెంటనే ఇంటికి వచ్చేసేవాడు. తరువాత ఒకసారి తిరిగివెళ్లి మరిరాలేదు. 4 నెలల క్రితం దేముడు వైజాగ్ రైల్వేస్టేషన్లో ఎయుటిడి సిబ్బందికి పట్టుబడ్డాడు. అతను శ్రద్ధామందుల ద్వారా బాగా కోలుకోవడంతో అతని భార్య సూరమ్మ వివరాలు తెలుసుకుని ఆదివారం అతని క్షేమంగా అప్పగించడం జరిగిందని ఎయుటిడి కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. అతని చెల్లి, భార్య ఆనందంతో ఎయూటిడి సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

బెర్రీబోరర్ తెగుళ్లను నివారించాలి

ప్రజాశక్తి - జికె వీధి: కాఫీ తోటలు పెంచే రైతులకు కాఫీ తోటలకు ఇప్పుడు బెర్రీ బోరర్ తెగులు సోకడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని టిడిపి గ్రామకమిటి సభ్యులు దేశగిరిగోవిందరావు అన్నారు. వీటి నష్టాన్ని తెలుసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు కాఫీ తోటల పెంపకంపై ప్రత్యేక శాస్త్రవేత్తలు బృందాన్ని పంపించి వ్యాప్తి చెందకుండా నివారణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించా రన్నారు. పరిశీలించిన శాస్త్రవేత్తలు,అధికారులు తగు సూచనలు ఇస్తున్నారని అవి పాటించాలని ఆయన తెలిపారు

.పాత్రికేయునికి టిడిపి నేతల పరామర్శ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: నాలుగు నెలల కిందట రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స అనంతరం జడ్డంగి గ్రామంలోని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకొంటున్న జిల్లావాణి విలేకరి ముడుసు విజయ్ కుమార్‌ను ఆదివారం రాజవొమ్మంగి టిడిపి మండల ప్రధాన కార్యదర్శి ముప్పన డింభకేశ్వరావు ఆదివారం పరామర్శించారు. ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఆయన వెంట మండల టిడిపి తెలుగు యువత అధ్యక్షుడు బారింగి అనుదీప్, బూత్ ఇంచార్జి చవల కుమార్‌బాబు తదితరులు ఉన్నారు.

పిచ్చికుక్క దాడిలో ఐదుగురికి గాయాలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలోని చిన్నరెల్లంగిపాడు గ్రామంలో ఐదుగురు వ్యక్తులపై ఆదివారం పిచ్చికుక్క దాడి చేసి గాయపరిచింది. గ్రామంలో నడచి వెళ్లేవారిని, బైక్‌పై వెళ్లేవారిని పిచ్చికుక్క వెంటపడి గాయపరిచింది. గాయపడ్డ వారిలో ఎఎన్‌ఎం కె అప్పలనర్స, పి.వరలక్ష్మి మరో ముగ్గురు వ్యక్తులు ఉన్నారు. గాయపడ్డ వారిని స్థానిక పిహెచ్‌ఇకి తరలించగా వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం అడ్డతీగల సిహెచ్‌సికి తరలించారు. అధికారులు స్పందించి కుక్కలు నిర్మూలించేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



పట్టుబడిన గంజాయితో ముద్దాయిలు

40 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - జికె వీధి : మండలంలోని పెదవలస గ్రామంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా నాతవరం గ్రామానికి చెందిన మేకల అప్పారావు (42), మల్లవరపు అఖిల్ (21) ద్విచక్ర వాహనంపై 40 కిలోల గంజాయి రవాణా చేస్తూ పోలీసులకు పట్టుబడ్డారని కేసు నమోదు చేసి రిమాండ్‌కి తరలించామని జికె వీధి ఎస్ఐ సురేష్ తెలిపారు. కార్యక్రమంలో జికెవీధి పోలీస్‌సిబ్బంది, విఆర్ఓ పాల్గొన్నారు.

ఉధృతమవుతున్న లూలూ వ్యతిరేక ఉద్యమం

- ఆ భూమిలో సైన్స్‌సిటీ నిర్మించాలి
- విశాఖ ప్రజావనరుల పరిరక్షణ వేదిక డిమాండ్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: లులుమాల్‌కు ఇచ్చిన ప్రభుత్వ స్థలాన్ని వెనక్కు తీసుకోవాలని విశాఖ ప్రజావనరుల పరిరక్షణ వేదిక డిమాండ్ చేసింది. ఈ మేరకు నగరంలో విస్తృతంగా కరపత్రాల పంపిణి నిర్వహిస్తోంది. ఆదివారం నగరంలోని బీచ్ రోడ్డులో పార్క్ హోటల్ నుండి వేదిక కార్యకర్తలు పెద్ద ఎత్తున లులుమాల్‌కు వ్యతిరేకంగా ప్రచారం నిర్వహిస్తూ ఈ సంస్థ వల్ల జరిగే నష్టాలను వివరించారు. వేదిక కన్వీనర్లు డాక్టర్ సి.ఎన్.క్షేత్రపాల్‌రెడ్డి, ఎస్.వెంకటలక్ష్మి మాట్లాడుతూ, నగరంలో ప్రభుత్వ స్థలాలు కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. లులూకి ఇచ్చిన స్థలాన్ని వెనక్కు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ స్థలంలో సైన్స్ సిటీని నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వేదిక నాయకులు రవి, అచ్యుతరావు, బాలనాగమ్మ, హేమంత్, బి.రామకృష్ణ, బి. పుష్పలత తదితరులు పాల్గొన్నారు.